సాక్షి సంగారెడ్డి

మంగళవారం : 26 : ఆగస్టు : 2025



భవితకు 'నవోదయం'

వసతులు, క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యకు మారుపేరుగా నవోదయ విద్యాల యాలు నిలుస్తున్నాయి. వివరాలు 8లో ▸



వైద్యుల పర్యవేక్షణలో..

ఎలుక పడిన నీరు తాగి అస్వస్థతకు గురైన చిన్నారులు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు 8లో ▸



కమిషన్ డబ్బులు...

రేషన్ డీలర్లకు రావాల్సిన కమిషన్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డీలర్లు నిరసన చేపట్టారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మెనూ ప్రకారం భోజనం

వార్డెన్‌కు ఏఎస్‌డబ్ల్యూఓ ఆదేశం

వట్‌పల్లి(అందోల్): వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం వట్‌పల్లి మండలం దేవునూర్ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతిగృహం పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించడంలేదని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట సిబ్బందిని ఇతర చోట్లకు పంపించారు. వార్డెన్ అందుబాటులో ఉండాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గిరిజన బిడ్డకు అరుదైన గౌరవం



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న ప్రకాశ్

సంగారెడ్డి: గిరిజన బిడ్డకు అరుదైన గౌరవం దక్కింది. పుల్కల్ మండలం లాల్‌సింగ్ నాయక్ తండాకు చెందిన రామావత్ ప్రకాశ్ వ్యాయామ విద్య(స్పోర్ట్స్)లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. నగరంలో ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ నుంచి పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రకాశ్‌ను అభినందించారు.

చెత్త సేకరణ షెడ్లను వినియోగించుకోవాలి

డీపీఓ సాయిబాబా

సంగారెడ్డి టౌన్: గ్రామాల్లోని చెత్త సేకరణ షెడ్లను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని డీపీఓ సాయిబాబా అన్నారు. సోమవారం మండలంలోని తాళ్లపల్లిలో ఉన్న డంపు యార్డ్, శ్మశానవాటిక, చెత్తసేకరణ షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరణ చేయించాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు.

విద్యపై నిర్లక్ష్యం తగదు

ఏబీవీపీ అధ్యక్షుడు ఈశ్వర్

జహీరాబాద్ టౌన్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని ఏబీవీపీ జహీరాబాద్ అధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రూ.8,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, నిధులు విడుదల చేయడంలో జాప్యం వహిస్తున్నారని ఆరోపించారు. పేద విద్యార్థులు స్కాలర్‌షిప్‌పై ఆధారపడి చదువుతుంటారని, ఫీజులు చెల్లించనిదే కళాశాల నిర్వాహకులు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు. నాయకులు బసవరాజ్, అభివర్ధన్, సమీర్ పాల్గొన్నారు.

గణనాథుల తయారీపై పోటీలు

నారాయణఖేడ్: పర్యావరణహిత మట్టి, ఇతర సహజ వనరులతో గణనాథుల తయారీపై విద్యార్థులకు మండల, డివిజన్‌స్థాయి పోటీలకు సబ్ కలెక్టర్ ఉమాహారతి శ్రీకారం చుట్టారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ఆమె ప్రత్యేకంగా పోటీల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. డివిజన్ పరిధిలోని 14 గురుకులాల్లో పోటీలు పూర్తయ్యాయి. సోమవారం నుంచి డివిజన్ పరిధిలోని 34 ఉన్నత పాఠశాలల్లో పోటీలు ప్రారంభమయ్యాయి. మండల, డివిజన్ స్థాయిల్లో అందంగా తయారు చేసిన విద్యార్థులను ఎంపికచేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయనున్నట్లు ఆమె వివరించారు.

మద్యం దుకాణాలు కేటాయించాలి

నారాయణఖేడ్: మద్యం దుకాణాల టెండర్లలో కల్లుగీత కార్మికులకు 25 శాతం కేటాయించాలని గీత కార్మిక కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గోపి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సంఘం డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు 25 శాతం దుకాణాలను కేటాయించాలన్నారు. వ్యక్తిగతం కాకుండా కల్లుగీత సహకార సంఘాలకు కేటాయిస్తే ఎక్కువ మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. వృత్తి పెన్షను రూ.5 వేలకు పెంచి కల్లుగీత కార్పొరేషన్‌కు రూ.5 వేల కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు భూమాగౌడ్, జిల్లా, స్థానిక బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



హత్నూర సొసైటీ కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు

యూరియా.. అయిపాయే..!

- రైతన్నకు తప్పని తిప్పలు
- దుకాణాల వద్ద పడిగాపులు

హత్నూర(సంగారెడ్డి): రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. గంటల తరబడి నిరీక్షిస్తున్నా.. యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం హత్నూర మండలానికి 1,426 బస్తాలు, దౌల్తాబాద్ సత్యసాయి ఎరువుల దుకాణం వద్ద 415 యూరియా బస్తాలు, దౌల్తాబాద్ ఆగ్రో ఎరువుల దుకాణానికి 222 యూరియా బస్తాలు, హత్నూర సొసైటీ వద్ద 444 యూరియా బస్తాలు వడ్డేపల్లిలో 345 యూరియా బస్తాలు వచ్చాయి. విషయం తెలిసిన రైతులు ఒక్కసారిగా షాపుల వద్ద ఎగబడ్డారు. ఒక రైతుకు రెండు బస్తాలే ఇచ్చినప్పటికీ వచ్చిన యూరియా చూస్తుండగానే అయిపోయింది. దీంతో చాలా మంది రైతులు నిరాశతో వెనుతిరిగారు. యూరియా దొరకక రైతులు రోజుల తరబడి పని మానుకొని తిరగాల్సిన దుస్థితి నెలకొందని పలు గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, మంగళవారం 30 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా మండలానికి 400 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

పరిశ్రమలు.. మృత్యు కుహరాలు



- తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ యంత్రాలను సర్దేసి
- ఇరుకైన ప్రదేశాల్లో కొనసాగుతున్న వస్తు ఉత్పత్తి
- కాలం చెల్లిన యంత్ర పరికరాలనే కొనసాగింపు
- పని ప్రదేశంలో కనీసం వెంటిలేషన్ కూడా కరువు
- పరిశ్రమల్లో కార్మికుల భద్రత ప్రమాణాలు గాలికి..
- అధికారుల తనిఖీల్లో వెలుగులో ఆందోళనకరమైన అంశాలు

పాశమైలారం పారిశ్రామికవాడలో సుమారు 30 ఏళ్ల క్రితం ఎకరం విస్తీర్ణంలో ప్రారంభమైన పరిశ్రమలో ఉత్పత్తి సామర్థ్యం మూడు రెట్లు పెరిగింది. పెరిగిన ఉత్పత్తి సామర్థ్యానికి అవసరమైన అదనపు యంత్ర పరికరాలు మాత్రం అదే ఎకరంలోనే సర్దేశారు. దీంతో ఇరుకు షెడ్లలో కార్మికులు పనిచేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పదుల సంఖ్య ప్రాణాలు గాలిలో కలిసే పరిస్థితులు నెలకొన్నాయి.

గడ్డపోతారంలో ఉన్న మరో పరిశ్రమలో పని ప్రదేశంలో కనీసం వెంటిలేషన్ కూడా లేదు. కెమికల్ రియాక్షన్ జరిగి అపాయకరమైన వాయువులు వెలువడితే.. ఆ విషవాయువులు గాలిలో కలిసిపోయే పరిస్థితులు కూడా లేనంత దుర్భర పరిస్థితులు ఉన్నాయి. పాతబడిన యంత్రాలతో ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఉత్పత్తి కొనసాగుతోంది.

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలోని కొని పరిశ్రమలు మృత్యుకుహరాలను తలపిస్తున్నాయి. కార్మికులు విధులు నిర్వర్తించే పని ప్రదేశాలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల కనీసం వెంటిలేషన్ కూడా సరిగ్గా ఉండటం లేదు. కొన్ని పరిశ్రమలు చీకటి గుహలకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే కార్మికులకు ఊపిరి కూడా సరిగ్గా పీల్చుకోని పరిస్థితులు నెలకొన్నాయి. చాలా పరిశ్రమలు కాలం చెల్లిన యంత్ర పరికరాలతో నెట్టుకొస్తున్నాయి. మరికొన్నింటిలో రియాక్టర్లు, బాయిలర్లు వంటి కీలక యంత్రాలు కూడా కాలం చెల్లినవే ఉన్నట్లు గుర్తించారు. ఇలా అధికారుల బృందాలు చేపట్టిన తనిఖీల్లో ఈ ఆందోళనకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. లాభార్జనే ధ్యేయంగా పరిశ్రమలను నడుపుతున్న యాజమాన్యాలు ప్రమాదాలు జరిగితే పోయేది నిరుపేద వలస కార్మికుల ప్రాణాలే కదా అన్న ధోరణితో ఆయా పరిశ్రమల యాజమాన్యాలు వ్యవహరిస్తుండటం గమనార్హం.

40 పరిశ్రమల్లో తనిఖీలు పూర్తి

తొలి విడతలో హై రిస్క్ పరిశ్రమలను తనిఖీలు చేస్తున్నారు. ప్రమాదాలు జరిగితే ప్రాణనష్టం, ఆస్తినష్టం ఎక్కువగా ఉండేందుకు ఆస్కారం ఉన్న ఫార్మా, కెమికల్, గ్లాస్, బల్క్‌డ్రగ్, పెయింట్ వంటి పరిశ్రమల్లో తనిఖీలు సాగుతున్నాయి. మొత్తం 599 పరిశ్రమలను తనిఖీలు చేయాల్సి ఉండగా, 48 పరిశ్రమలను తనిఖీలు చేశారు. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న సుమారు ఎనిమిది పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. నెల రోజుల్లో ఈ తనిఖీలు పూర్తికి ప్రభుత్వం నెలరోజులు గడువు విధించింది. ఈ తనిఖీలన్నీ పూర్తి కావడానికి మరో మూడు నెలలు పట్టే అవకాశాలు ఉన్నాయని ఫ్యాక్టరీల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పాశమైలారం అగ్ని ప్రమాదం నేపథ్యంలో..

పటాన్‌చెరు పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ పరిశ్రమలో రెండు నెలల క్రితం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం విదితమే. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రమాదాల్లో ఒకటైన ఈ ప్రమాదం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మేల్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హై రిస్క్ పరిశ్రమల్లో భద్రత పరమైన తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా వివిధ శాఖల అధికారులు సభ్యులుగా ఉన్న రెండు బృందాలు జిల్లాలోని పరిశ్రమలను తనిఖీలు చేస్తున్నాయి. ఈ తనిఖీల్లో ఆందోళనకరమైన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి.

మండపాలకు ఉచిత విద్యుత్

టీజీఎస్ పీడీసీఎల్ ఉత్తర్వులు

- జిల్లాలో 3,204 గణేష్, 100 దుర్గామాత మండపాలు
- నిర్వాహకులకు రూ.93 లక్షల ఆదా

నారాయణఖేడ్: వినాయక చవితి, దసరా పండుగల సందర్భంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గణేశ్, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ (టీజీఎస్ పీడీసీఎల్) ఉత్తర్వులు జారీ చేసింది. వినాయక చవితికి ఆగస్టు 24 నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు, దేవీ శరన్నవరాత్రి సందర్భంగా సెప్టెంబరు 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ ఉచిత విద్యుత్‌ను అందించనున్నారు. ఉచిత విద్యుత్ కోసం ఆర్గనైజర్లు సంబంధిత ప్రొఫార్మా-1లో, విద్యుత్ వినియోగ బిల్లు వివరాలను ప్రొఫార్మా-2లో సమర్పించాలని సూచించారు. వెంటనే ఈ ఉత్తర్వులను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో రూ.93 లక్షలు ఆదా

ఉచిత విద్యుత్ వల్ల గణేష్, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల మండపాల నిర్వాహకులకు రూ.93 లక్షల విద్యుత్ బిల్లులు ఆదా కానున్నాయి. జిల్లాలో సుమారు 3,206 వినాయక మండపాలను ఏర్పాటు చేస్తారు. అన్ని మండపాలకు కలిపి 4,100 కిలో మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తారు. ఈ విద్యుత్‌కు గాను రూ.90.25 లక్షల వ్యయం అవుతుంది. జిల్లాలో పట్టణ ప్రాంతాలు, కొన్ని గ్రామాల్లో 100 దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. ఈ మండపాలకు రూ.2.80 లక్షల విలువగల 128 కిలోవాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ఈ విద్యుత్‌ను కూడా పూర్తి ఉచితంగా అందజేయనున్నారు. ఉచిత విద్యుత్ వల్ల మండపాల నిర్వహణ, విద్యుత్ దీపాలు, హైమాస్ట్ లైట్లు, భజనలు, భక్తి కార్యక్రమాలకు మైక్, సౌండ్‌బాక్సులకు భారీగా విద్యుత్ బిల్లులు కావడంతో మండపాల నిర్వాహకులకు ఆర్థిక భారం తగ్గనుంది.

హైవేలపై అండర్‌పాస్‌లు

- మంత్రి దామోదర రాజనర్సింహ
- అధికారులతో కలిసి పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర

వట్‌పల్లి(అందోల్): నాందేడ్-అకోలా జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన చోట అండర్‌పాస్ బ్రిడ్జిలను నిర్మించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం హైవే అధికారులతో కలిసి 161 జాతీయ రహదారిని పరిశీలించారు. అందోల్ మండలం డాకూర్ వంతెన వద్ద అండర్‌పాస్ లేకపోవడంతో డాకూర్ వెళ్లే గ్రామాల ప్రజలు సుమారు 6 కి.మీల దూరం సర్వీసు రోడ్డు ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. ఇలా హైవేపై రానుపోను అదనంగా 12 కి.మీల దూరం ప్రయాణం చేస్తున్నారు. ఇబ్బందులు పరిగణలోకి తీసుకొని డాకూర్ వద్ద అండర్‌పాస్, అల్మాయిపేట వద్ద వంతెన ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ పాండు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం

విగ్రహాలను పంపిణీ చేసిన కలెక్టర్ ప్రావీణ్య



మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య తదితరులు

సంగారెడ్డి జోన్: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు. వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు తోపాజి అనంత కిషన్‌తో కలిసి కలెక్టర్ చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 5 వేలకు పైగా విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు తోపాజి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మట్టి విగ్రహాలతో వాయు, నీటి కాలుష్యాన్ని పూర్తిగా నివారించవచ్చన్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

అన్ని శాఖల జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు సంక్షేమ వసతి గృహాలు తనిఖీ చేసి, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి వహించాలన్నారు. మహోత్సవంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని వివరించారు.

ప్రజావాణికి 35 అర్జీలు

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎపపటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 35 అర్జీలు వచ్చాయి. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని బాధితులు వాపోయారు. వినతులు స్వీకరించిన వారిలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, డీఆర్‌ఓ పద్మజరాణి పాల్గొన్నారు.

సార్.. ప్లానింగే వేరు!

- ఎప్పుడొస్తారో తెలియదు
- టౌన్‌ప్లానింగ్ అధికారి తీరుపై విమర్శల వెల్లువ



ఖాళీగా దర్శనమిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి కుర్చీ

సంగారెడ్డి: ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు అధికారులు సమయపాలన పాటించకుండా 'మా రూటే.. సెపరేటు..'అన్నట్టు వ్యవహరిస్తున్నారు. తామొచ్చిందే టైం, చేసిందే పనిగా ప్రవర్తిస్తున్నారు. ఫలితంగా ప్రజలు పడిగాపులు కాయాల్సి వస్తోంది. సంగారెడ్డి బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారి మధ్యాహ్నం 12 గంటలు దాటినా విధులకు హాజరు కావడం లేదు. తన లెక్కేవేరు అన్నట్టు వ్యవహరిస్తున్న సదరు అధికారిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం 10 గంటలకే కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఆయన రాక కోసం పడిగాపులు కాస్తున్నారు. ఒక్కోసారి సాయంత్రం వరకు కూడా ఆయన దర్శనం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. వారంలో రెండు రోజులే వస్తారని, అది కూడా సమయానికి రారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించేలా, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి మండపాన్ని సందర్శించాలి: ఎస్పీ



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ పరితోష్

సంగారెడ్డి జోన్: ప్రతి వినాయక మండపాన్ని పోలీసు అధికారులు సందర్శించాలని ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భద్రత నిర్వహణలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకులకే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డీజే బాక్స్‌లకు అనుమతి లేదని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ఆన్ లైన్ లో అనుమతి పొందాలన్నారు. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణంలో పండుగ వేడుకలు జరుపుకోవాలని పేర్కొన్నారు.

బ్యాంకుల వద్ద బందోబస్తు

జిల్లాలోని వివిధ బ్యాంకుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని బ్యాంకు అధికారులకు ఎస్పీ సూచించారు. సోమవారం బ్యాంకు అధికారులతో సమీక్షించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలతోపాటు ఖాతాదారులకు బ్యాంకు, పోలీస్ అధికారులు కలిసి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సైబర్ క్రై మ్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, వివిధ బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

టన్నుకు రూ.1200

- ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక పంపిణీ
- ఇతరులు రూ.1800 చెల్లించాలి
- నేడు ఇసుక బజార్ ప్రారంభం



అందోలు శివారులో ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్

జోగిపేట(అందోల్): ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ఇసుక బజార్లను ఏర్పాటు చేసింది. అందోలు శివారులో టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక బజార్‌ను మంగళవారం వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించనున్నారు. ప్రస్తుతం 1,500 టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. ప్రభుత్వం సంగారెడ్డి జిల్లాలో ప్రయోగాత్మకంగా మూడు మండలాలను గుర్తించింది. ఇటీవల అందోలు, కోహీర్, నిజాంపేట మండలాల్లో ఇసుక స్టాక్ పాయింట్‌లను ఏర్పాటు చేసింది. డిజిటల్ మానిటరింగ్ ద్వారా కేంద్రాలను నిర్వహించనున్నట్లు సమాచారం. ఇందిరమ్మ లబ్ధిదారులు టన్ను ఇసుకకు రూ.1,200, ఇతరులు రూ.1,800 చెల్లించాలి. బహిరంగ మార్కెట్‌లో మాత్రం రూ.2వేలకు పైబడి ఉంది. ఇసుక ఎవరికి అవసరం ఉన్నా టీజీఎండీసీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. మరుసటి రోజే సాండ్ బజార్ వద్దకు వచ్చి తీసుకొని వెళ్లవచ్చని ప్రాజెక్టు ఆఫీసర్ అకుల శ్రీకాంత్ తెలిపారు. ట్రాన్స్‌పోర్టు ఖర్చులు లబ్ధిదారుడే భరించాలని చెప్పారు.

డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోతే

డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోతే ప్రజలు మళ్లీ మార్కెట్ వైపు వెళ్లిపోయే అవకాశం ఉంది. ఇసుక పంపిణీలో రాజకీయ నాయకుల ప్రమేయం లేనట్లయితే అధికారిక వ్యవస్థ స్వేచ్ఛగా పనిచేస్తే ప్రభుత్వ ఆశయం నెరవేరే అవకాశం ఉంది. సర్కారే ఇసుక స్టాక్ పాయింట్‌లను ఏర్పాటు చేస్తుండటంతో అమ్మకం ద్వారా ఖజానాకు ఆదాయం రావడంతోపాటు, అక్రమ మాఫియా నియంత్రణ జరుగుతుంది. నిర్వహణ పారదర్శకంగా ఉండి, పాలసీ అనుసరణ, టెండర్లు, డిజిటల్ మానిటరింగ్ ఉంటే.. కేంద్రాలు విజయవంతమయ్యే అవకాశం ఉంది.

స్టాక్ పాయింట్‌తో ప్రయోజనం

ప్రజలకు స్టాక్ పాయింట్‌తో ప్రయోజనం చేకూరుతుంది. మార్కెట్‌లో టన్ను ఇసుకకు రూ.2700 వందల వరకు ఉంది. కేవలం ఇందిరమ్మ ఇళ్లకు మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇక్కడ మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు నాణ్యత కలిగిన ఇసుక దొరుకుతుంది. ప్రజలు టోకెన్ తీసుకుని తమ అవసరానికి అనుగుణంగా బుకింగ్ చేసుకోగలుగుతారు.

క్లుప్తంగా

బైబిల్ హౌస్ ప్రారంభం



ప్రారంభిస్తున్న రూబెన్‌మార్క్

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్‌ఐ చర్చి ప్రాంగణంలో సోమవారం మాడ రేటర్ ప్రొఫెసర్ రూబెన్‌మార్క్ బైబిల్ హౌస్‌ను ప్రారంభించారు. ఇందులో అన్ని భాషల్లో ఉన్న బైబిళ్లు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో చర్చి ప్రెసిబెటరి ఇన్‌చార్జి శాంతయ్య, గంట సంపత్ తదితరులు ఉన్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ



మెడల్ అందుకుంటున్న హర్షవర్ధన్

దుబ్బాకటౌన్: హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో బొమ్మక్ శంకరయ్య కన్వెన్షన్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో దుబ్బాకకు చెందిన యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ విద్యార్థి వేముల హర్షవర్ధన్ పాల్గొని గోల్డ్ మెడల్ సాధించి సత్తా చాటాడని కరాటే మాస్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌కు సైతం నిర్వాహకులు బెస్ట్ కోచ్ అవార్డు అందించారు. ఇరువురిని నిహాన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆర్గనైజేషన్ ఇండియా వ్యవస్థాపకుడు రవీందర్, రేంజుకి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు మాస్టర్ నగేశ్, అధ్యక్షుడు అశోక్, జనరల్ సెక్రటరీ నవీన్ కుమార్, సురేందర్, సిద్ధార్థ్ అభినందించారు.

అడవి పందుల బీభత్సం

పంటలు ధ్వంసం



చేనును పరిశీలిస్తున్న ఏఈఓ శ్రీలత, రైతు భాస్కర్

అక్కన్నపేట(హుస్నాబాద్): పంటలను అడవి పందులు ధ్వంసం చేశాయి. మండలంలోని రామవరం గ్రామ పరిధిలోని బంగారు లొద్ది తండా, సేవాలాల్ మహారాజ్ తండాలో సుమారు 13మంది రైతులు సాగుచేసిన మొక్కజొన్న, ఇతర పంటలపై పందులు దాడి చేశాయి. సోమవారం వ్యవసాయ విస్తరణాధికారి శ్రీలతతోపాటు ఫారెస్టు అధికారులు పంటలను పరిశీలించారు. నష్టపోయిన పంటల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. ప్రస్తుతం చేను కంకి దశలో ఉందన్నారు. చేను చుట్టూ వల, చీరలు కట్టి.. రాత్రి కాపలా ఉన్నా కూడా పంటపై దాడి చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని పలువురు రైతులు కోరారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

నర్సాపూర్: రోజువారి ప్రణాళికతో చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు ప్రత్యేక పరిశీలకుడు కిషన్ విద్యార్థులకు సూచించారు. ఆయన సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. వంద శాతం ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. కాగా కాలేజీకి చెందిన పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పలు అంశాలను ప్రిన్సిపాల్ శేషాచారి ఆయనకు వివరించారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీడీ

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటారు. మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో మొదటి స్థానంలో నిలిచారు. త్వరలో హైదరాబాద్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో విద్యార్థుల జట్టు మొదటి స్థానంలో నిలిచింది. జట్టుకు రూ. 10 వేల నగదు, ట్రోఫీ, ప్రశంసా పత్రాలు అందజేశారు. నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 3 వేల నగదు, సర్టిఫికెట్లు అందజేశారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

న్యాల్‌కల్(జహీరాబాద్): నలుగురు పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ సుజిత్ కథనం ప్రకారం... హద్నూర్ గ్రామ శివారులో గ్రామానికి చెందిన కొందరు పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం దాడి చేశారు. దాడిలో పట్టుబడిన నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3980 నగదు, పేకాట ముక్కలు, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

భవితకు ‘నవోదయం’

ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆహ్వానం

- రేపే దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు
- డిసెంబర్ 13న ప్రవేశపరీక్ష



వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): ఆశ్రమ వసతులు, క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యకు మారుపేరుగా నవోదయ విద్యాలయాలు నిలుస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయలో 2026–27విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి డిసెంబర్ 13న ఎంట్రెన్స్ టెస్ట్ జరగనుంది. ఇందుకు విద్యార్థుల నుంచి ఈ నెల 27 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం 1987లో ఉమ్మడి జిల్లాలోని వర్గల్‌లో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేసింది. ఆంగ్లం, తెలుగు, హిందీ త్రిభాషా సూత్రం ప్రాతిపదికన జాతీయ సమైక్యతకు బాటలు వేస్తున్నది. గ్రామీణ విద్యార్థుల ఉజ్వల భవితకు సోపానంగా నిలుస్తోంది. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులు, బాల బాలికలకు వేర్వేరు డార్మెటరీలు, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు క్వార్టర్లు వంటి వసతులు ఉన్నాయి. అంతర్గత సీసీరోడ్లు, స్ట్రీట్‌లైట్లు, ఆరోగ్యాన్ని పంచే హరిత సంపద, సుశిక్షితులైన అధ్యాపక గణం, స్మార్ట్ క్లాసులు, సైన్స్, మ్యాథ్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, ఆటలకు బాసటగా విశాలమైన స్టేడియం, బాస్కెట్‌బాల్ తదితర మైదానాలు, జిమ్, హెల్త్ సెంటర్‌లతో నవోదయ ప్రత్యేకతను చాటుతుంది. ఇక్కడ పుస్తకాలు, దుస్తులు సహా విద్యార్థులకు అన్నీ ఉచితమే. ఇక్కడ ఆరు, ఏడు తరగతులు మాతృభాషలో, ఎనిమిదో తరగతి నుంచి ఆంగ్లంలో విద్యాబోధన చేస్తారు.

27 వరకు దరఖాస్తుల స్వీకరణ

వర్గల్ నవోదయలో ప్రవేశానికి డిసెంబర్ 13న ఎంట్రెన్స్ పరీక్ష జరగనుంది. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 27వరకు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.గవ్.ఇన్ ద్వారా దరఖాస్తులు అప్‌లోడ్ చేయవచ్చు. అర్హత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు.

అభ్యర్థుల అర్హతలు

ప్రస్తుత విద్యా సంవత్సరం ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రభుత్వ లేదా సర్కారు గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదువుతుండాలి. వరుసగా 3,4,5 తరగతులు ఒకే పాఠశాలలో చదివి ఉండాలి. మే 1, 2014 – జూలై 31, 2016 మధ్య జన్మించి ఉండాలి.

సద్వినియోగం చేసుకోవాలి



2026–27 విద్యా సంవత్సరం ఆరో తరగతి ప్రవేశానికి డిసెంబర్ 13న ఎంట్రెన్స్ పరీక్ష జరగనుంది. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫారాన్ని వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. వివరాలు పూరించి, హెచ్‌ఎం సంతకంతో ఆన్‌లైన్‌లో గడువులోగా అప్‌లోడ్ చేయాలి. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– రాజేందర్, ప్రిన్సిపాల్, వర్గల్ నవోదయ

భూ సేకరణ చట్టం ఉల్లంఘన



మాట్లాడుతున్న రాంచందర్

- 30న నిమ్స్ కార్యాలయం ఎదుట ధర్నా
- వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు రాంచందర్

జహీరాబాద్‌టౌన్: భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘించి అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ ఆరోపించారు. పట్టణంలోని శ్రామిక్ భవనంలో సోమవారం నిమ్స్ రైతుకూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ సేకరణ చట్టానికి తూట్లు పొడుస్తున్నారని, రైతుల నుంచి భూములను బలవంతంగా తీసుకుంటున్నారని మండిపడ్డారు. పరిశ్రమలు ఎప్పుడు వస్తాయో తెలియకుండా వ్యవసాయ భూములను తీసుకోవద్దని, కూలీలకు ఇవ్వాల్సిన పునరావాసం గురించి ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. అధికారుల వైఖరికి నిరసనగా 30న నిమ్స్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్, బాలప్ప, సంజీవ్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కల్హేర్(నారాయణఖేడ్): ఎన్నికలు వస్తేనే రైతు భరోసా, ప్రభుత్వ పథకాలు అరకొరగా అమలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం సిర్గాపూర్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారం కోసం హామీలు ఇచ్చి రైతులు, ప్రజలను అన్ని విధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లడుతూ.. నల్లవాగు కాల్వల్లో పూడిక తీయడంలో జాప్యం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీలు మహిపాల్‌రెడ్డి, జంగం శ్రీనివాస్,సంజీవరావు, నజీబ్, ముజమ్మిల్, మాధవరావు పటేల్, బాదల్‌గాం నగేష్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

63 లక్షల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్ట్.. రెండు కార్లు స్వాధీనం



ఎండు గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

సంగారెడ్డి: ఆంధ్రా ఒడిశా బార్డర్ నుంచి రెండు కార్లలో గంజాయిని తరలిస్తుండగా సంగారెడ్డి డీటీఎఫ్ టీం పట్టుకుంది. సోమవారం కేసుకు సంబంధించిన వివరాలను మెదక్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్ వెల్లడించారు. ఏవోబీ నుంచి గంజాయి మహారాష్ట్రకు వెళుతుందనే సమాచారంతో సంగారెడ్డి కంది మండలం చేర్యాల గేటు వద్ద కాపు కాసి మహారాష్ట్రకు చెందిన వాహనాలను ఆపి తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ కారును తనిఖీ చేస్తుండగా కారు డిక్కీలో, బాడీ కింద ప్రత్యేకమైన అరలు చేయించి గంజాయిని సరఫరా చేస్తున్నారు. ఒక కారులో 69.5 కేజీలు, మరో కారులో 53.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ. 63 లక్షలుంటుందని తెలిపారు. నిందితులు అబ్దుల్ వహాబ్ సయ్యద్, ఉమాకాంత్ సబర్‌ను అరెస్ట్ చేశారు. చాంద్ మహమ్మద్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. డీటీఎఫ్ సీఐ శంకర్, నజీర్ పాషా, సిబ్బంది, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్రను అభినందించారు.

వ్యాపారంలో నష్టం.. అప్పులు తీర్చేందుకు చోరీలు

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

సంగారెడ్డి క్రైమ్: మహిళ మెడలోంచి బంగారం ఎత్తుకెళ్లిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సత్తయ్య గౌడ్ కేసు వివరాలు వెల్లడించారు. కొండాపురం గ్రామానికి చెందిన కొకుంట్ల ప్రభాకర్ (38) పట్టణంలోని వసంతనగర్ కాలనీల్లో నివాసం ఉంటూ, వృత్తిరీత్యా డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పట్టణంలోని ఓడీఫ్ కాలనీ, ద్వారక కాలనీకి చెందిన సండ హంసమ్మ ఈనెల 24న ఉదయం ఆరు గంటల సమయంలో తన ఇంట్లో ఉండగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి వచ్చి వృద్ధురాలిని మంచానికి కట్టేసి, మెడలోని బంగారం దోచుకెళ్లాడు. ఆదివారం పట్టణంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా, బైక్‌పై వచ్చిన అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. కొన్ని నెలల క్రితం వ్యాపారంలో నష్టాలు వచ్చాయని, చేసిన అప్పులు తీర్చడానికి దొంగతనం చేశానని నిందితుడు పోలీసులకు తెలిపాడు. నిందితుని వద్ద నుంచి 5 తులాల బంగారం స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు.

భార్యాపిల్లలతో వ్యక్తి అదృశ్యం

సంగారెడ్డి క్రైమ్: భార్యాపిల్లలతో కలిసి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... పట్టణంలోని మంజీరానగర్‌కు చెందిన దొడ్ల దుర్గేశ్ (26), భార్య పావని వృత్తిరీత్యా కూలీ పనులు చేసుకుంటున్నారు. వీరికి 11 నెలల బాబు ఉన్నాడు. భార్యాభర్తలకు సంసార విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈనెల 23న ఉదయం ఇంటి నుంచి వెళ్లిన భార్యాభర్తలు తిరిగి రాలేదు. కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో మహిళ..

సంగారెడ్డి పట్టణంలోని రాజంపేట్‌కు చెందిన దున్నారం సాయి ప్రతాప్, భార్య(28) వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటి సామాగ్రి తెస్తానని ఈ నెల 22న మధ్యాహ్నం 2గంటల సమయంలో వెళ్లిన భార్య తిరిగి ఇంటికి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గీతంలో 160 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న గీతం విద్యార్థులు

పటాన్‌చెరు: భారతదేశం, నేపాల్‌లో లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించి, గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించాలని బ్రహ్మకుమారీస్ సంకల్పించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్రహ్మకుమారీలు (చందానగర్ శాఖ), సోషల్ సర్వీస్ వింగ్ (ఆర్‌ఈఆర్‌ఎఫ్), రెడ్ క్రాస్ సొసైటీల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. శిబిరంలో దాదాపు 160 మంది విద్యార్థులు రక్తదానం చేయగా, వీరికి బ్రహ్మకుమారీలు ప్రశంసా పత్రాలు అందజేశారు.

నీటి గుంతలో పడి యువకుడి మృతి



రాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఓ యువకుడు నీటి గుంతలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దకోడూరులో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... ఆసరాశి లక్ష్మి, సత్తయ్య దంపతుల కుమారుడు రాజు(20) కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతున్నాడు. ఈ క్రమంలో వాళ్ల ఇంటి సమీపంలోని నీటి గుంతలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. స్థానికులు గుర్తించి 108లో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి సత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జీడిమెట్లకు చెందిన బసవరాజు (38) రెండు నెలల క్రితం ముత్తంగి సాయిప్రియ కాలనీకి వచ్చి కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. అయితే బసవరాజు రోజు మద్యం తాగుతున్నాడు. ఐదు రోజుల నుండి భార్యాభర్తల మధ్య సంసార విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 24న రాత్రి భార్యను కొట్టడంతో పిల్లలని తీసుకుని ఇస్నాపూర్‌లో ఉన్న తన అక్క జగదీశ్వరి ఇంటికి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం భార్య ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపు గడియపెట్టి ఉండటంతో కిటికీ నుంచి చూసింది. అప్పటికే భర్త ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

గజ్వేల్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. గజ్వేల్ సీఐ రవికుమార్, పశువైద్యశాఖ ఏడీ రమేశ్ వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని అన్నవరం ప్రాంతం నుంచి ఓ కంటైనర్‌లో 89 పశువులను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారు పాతూరు కూరగాయల మార్కెట్ సమీపంలో పశువులను తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకున్నారు. ఇందులో 54గోవులు ఉండగా మిగతా 35 పశువులు ఉన్నట్లు గుర్తించారు. వాటిలో 5గోవులు, 2 పశువులు మృతి చెందాయి. పశువులను ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని లక్ష్మాపూర్‌లోగల గోశాలకు పంపించారు. ఒక డ్రైవర్ పారిపోగా, మరో డ్రైవర్‌తోపాటు క్లీనర్‌లను అదుపులోకి తీసుకున్నారు.

వైద్యుల పర్యవేక్షణలో చిన్నారులు

72 గంటల పాటు అబ్జర్వేషన్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

నర్సాపూర్: చుంచెలుక పడిన నీళ్లు తాగి అస్వస్థతకు గురైన చిన్నారులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శివ్వంపేట మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రంలో ఈనెల 23న ఎలుక పడిన నీళ్లు తాగి ఎనిమిది మంది చిన్నారులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. కాగా వారిలో రిషివర్ధన్‌కు కడుపు ఉబ్బడంతో అతన్ని ఆదివారం మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి పంపించారు. స్థానిక ఆస్పత్రిలో ఉన్న ఏడుగురిలో అక్షిత్ సోమవారం ఉదయం వాంతి చేసుకున్నాడు. 72గంటల అబ్జర్వేషన్‌లో ఉంచామని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని, ఆర్‌ఎంఓ రాజేశ్‌కుమార్ తెలిపారు. మిగతా చిన్నారులు కోలుకుంటున్నారని చెప్పారు. చికిత్స పొందుతున్న చిన్నారులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ పరామర్శించారు. ఆయన వెంట పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేశ్ గౌడ్, నాయకులు పెద్ద రమేశ్ గౌడ్, నారాయణరెడ్డి, చంద్రయ్య, బాల్‌రాజ్, రాజు, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న దివం బహుమతి

నర్సాపూర్: హాస్టళ్లలో వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ అండ్ కాలేజీల ప్రాంతీయ సమన్వయ అధికారి దివం బహుమతి సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని మైనారిటీ పాఠశాలలు, కాలేజీల ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలు, కాలేజీల పరిసరాలు శుభ్రంగా ఉండేందుకు ప్రభుత్వం నిర్దేశించిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసిజర్ నిబంధనలు పాటించాలన్నారు. మెనూ పాటించాలని, విద్యా విధానాలు, డైనింగ్ విధానాలను ప్రిన్సిపాల్స్ నిరంతరం పరిశీలించాలని సూచించారు. సమావేశంలో విజిలెన్స్ అధికారులు మహ్మద్‌గౌస్, జగదీశ్వర్‌రెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ వసీమోద్దీన్, స్థానిక పాఠశాల కాలేజీ ప్రిన్సిపాల్ నసీమా షేక్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడిన లారీ

జాతీయ రహదారిపై ట్రాఫిక్



లారీని క్రేన్ సాయంతో తొలగిస్తున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఉల్లి లోడ్‌తో వెళుతున్న లారీ బోల్తా పడింది. వివరాలు ఇలా.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జయ బాలాజీ గార్డెన్ సమీపంలో సోమవారం జాతీయ రహదారిపై సంగారెడ్డి వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఉల్లి లోడ్ లారీ డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో లారీలో ఉన్న ఉల్లి మూటలు జాతీయ రహదారిపై పడ్డాయి. ఆరు కిలోమీటర్ల మేర రుద్రారం వరకు ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ సీఐ లాలు నాయక్, సిబ్బందితో కలిసి క్లియర్ చేశారు. ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్‌ను వాహనదారులు డివైడర్ దాటించి పంపించారు. సంగారెడ్డి ట్రాఫిక్ పోలీసులు, కంది వైపు నుంచి వచ్చే వాహనాలను ఇతర దారుల గుండా మళ్లించారు.

పన్నులతో బీడీ పరిశ్రమ కుదేలు

రాష్ట్ర అధ్యక్షుడు గోపాలస్వామి

రామాయంపేట(మెదక్): బీడీ పరిశ్రమ పరిరక్షణకు కార్మికులు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ బీడీ మరియు సిగార్ వర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపాలస్వామి పిలుపునిచ్చారు. సంక్షోభం దిశగా బీడీ పరిశ్రమ– కేంద్రం విధి విధానాలు అనే అంశంపై సోమవారం స్థానిక ఫంక్షన్‌హాలులో జరిగిన సెమినార్‌లో పాల్గొని మాట్లాడారు. మినీ సిగరేట్లు తయారు చేస్తున్న కార్పొరేట్ పరిశ్రమలను పరిరక్షించడానికే కేంద్రం బీడీ పరిశ్రమను సంక్షోభంలోకి నెడుతుందని ఆరోపించారు. లక్షలాది మంది కార్మికులకు ఉపాధి చూపుతున్న బీడీ పరిశ్రమపై జీఎస్టీ పేరుతో అదనంగా పన్నులు విధించడంతో, భారాన్ని మోయలేక పరిశ్రమ కుదేలవుతుందన్నారు. కార్యక్రమంలో వికలాంగుల జాతీయ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి అడివయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, జిల్లా అధ్యక్షురాలు మంజుల, జిల్లా కార్యదర్శి బాలమణి పాల్గొన్నారు.

తుఫాన్‌లో చెలరేగిన మంటలు



ఆలయం వద్ద కాలిపోతున్న వాహనం

పటాన్‌చెరు టౌన్: తుఫాన్ వాహనంలో మంటలు చెలరేగి పాక్షికంగా కాలిపోయింది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల వివరాల ప్రకారం... మెదక్ జిల్లా రేగోడు మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన 12 మంది సోమవారం బీరంగూడలోని ఓ వేడుకకు వెళ్తున్నారు. కాగా, స్వామివారిని దర్శించుకునేందుకు వాహనాన్ని గణేశ్ దేవాలయ ఆవరణలో నిలిపి లోపలికి వెళ్లారు. ఈ లోపు వాహనంలో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో దేవస్థానం సిబ్బంది నీటితో మంటలను అదుపు చేశారు. అయినా అప్పటికే వాహనం పాక్షికంగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు.